ఎమ్మెల్సీ కోదండరాంకు సన్మానం

పరిగి, ఆగస్టు 18: తెలంగాణ ఉద్యమ సారథి ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా నియమితులైన సందర్భంగా విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రాం కోదండరాంను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఎంఈవో హరిశ్చందర్, నాయకులు రవీందర్‌గౌడ్, సోమశేఖర్, మదన్‌రెడ్డి, గోపాల్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

'రాఖీ' సందడి



ఆమనగల్లులో రాఖీ దుకాణం వద్ద కొనుగోలు దారులు

అన్నదమ్ముల, అక్కాచెల్లెళ్ల అన్యోన్యతకు చిహ్నం ఈ పండగ. తోబుట్టువుల మధ్య ప్రత్యేకమైన బంధానికి ప్రతీక. రాఖీ పౌర్ణమి రోజు సోదరీమణులు తమ సోదరుల చేతికి రాఖీ కట్టి, ఆశీర్వాదం పొందుతారు. నేడు రాఖీ పండగ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో రెండు మూడురోజులుగా దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. అలాగే మిఠాయి షాప్‌లు సైతం రద్దీగా దర్శనమిస్తున్నాయి. ఏ రోడ్డులో చూసినా రాఖీ దుకాణాలే దర్శనమిస్తున్నాయి. మార్కెట్‌లో రకరకాల రాఖీలను అందుబాటులో ఉంచారు. పిల్లల కోసం వెరైటీ రాఖీలు అనేకం కనిపిస్తున్నాయి. చోటా భీమ్, హల్క్, డోరేమాన్, సూపర్‌మాన్, షింషాన్, మోటు పత్లు తదితర కార్టూన్ పాత్రలతో కూడిన రాఖీలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. కాగా, మహిళలు ఆదివారం నుంచే సొంతూళ్ల బాట పట్టడంతో ఆర్టీసీ బస్సులు రద్దీగా కనిపించాయి.

- పూడూరు, ఆగస్టు 18



మన్నెగూడ చౌరస్తాలో వెలసిన రాఖీ దుకాణాలు

సర్దార్ సర్వాయి పాపన్న పోరాట పటిమను
ఆదర్శంగా తీసుకోవాలి

» కలెక్టర్ ప్రతీక్ జైన్



కలెక్టరేట్‌లో పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఆగస్టు 18 : బడుగు, బలహీనవర్గాలు సర్దార్ సర్వాయి పాపన్న పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి ఉత్సవాలను వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళుల అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యాన్ని స్థాపించిన మొట్ట మొదటి వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అన్నారు. సర్వాయి పాపన్న సాధారణ కుటుంబంలో జన్మించి పశువుల కాపరిగా, గీతా కార్మికుడిగా తన ప్రస్థానంలో భాగంగా అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాటం సలిపిన మహాయోధుడన్నారు. ఎటువంటి అండదండలు లేకుండా బడుగు కులాలను ఏకం చేసి భూస్వాములు, మొగల్‌లు శిస్తుల రూపంలో పన్నుల వసూళ్ల పేరుతో ప్రజలను పీడిస్తున్న క్రమంలో వారికి అండగా నిలిచి పోరాటం చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులు దేశభక్తి పాటలను ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులు నోటు పుస్తకాలు, పెన్నులను బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కె.ఉపేందర్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భీమరాజు, వసతి గృహ సంక్షేమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

"సాంప్రదాయ సాగు వదలి రైతులు ప్రయత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించే విధంగా సర్కారు చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో రైతులు ఆయిల్ పామ్ సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ఉద్యాన శాఖ చర్యలు చేపట్టింది. ఏయే మండలాల్లో ఆయిల్ పామ్ సాగుకు భూములు అనువుగా ఉన్నాయనేది అధికారులు గుర్తించారు. జిల్లాలో ఈ ఏడాది రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేపట్టే లక్ష్యంతో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు.



ఆయిల్ పామ్ సాగుకు ఊతం!

జిల్లాలో ఈ ఏడాది 2వేల ఎకరాల్లో సాగు లక్ష్యం

రైతులను ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు

వికారాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ఉద్యాన శాఖ చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు గత ప్రభుత్వం 25 జిల్లాలను ఎంపిక చేయగా, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ మినహా మిగతా అన్ని జిల్లాల్లో ఆయిల్ సాగును ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. వికారాబాద్ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు మూడేళ్ల కిందటనే కేంద్ర ప్రభుత్వం అనుమతించిన విషయం తెలిసిందే. పుష్కలంగా నీటి వసతి కలిగి, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం ఆర్జించే పంటల్లో ఒకటైన ఆయిల్ పామ్ సాగు పట్ల రైతులు కొంతకాలంగా ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లా రైతులు కూడా ఆయిల్ పామ్ సాగు పట్ల ఆసక్తి పెంచుకుంటున్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు కొత్త కావడంతో ఉద్యాన శాఖ అధికారుల ప్రోత్సాహాన్ని వారు ఆశిస్తున్నారు. నీటి వసతి పుష్కలంగా ఉండే ప్రాంతాలు ఆయిల్ పామ్ సాగునీటి ఎంతో అనుకూలంగా ఉంటాయి. ఆయిల్ పామ్ సాగు చేస్తే చీడ పీడలు, పురుగులు, క్రిమి కీటకాల బెడద చాలా తక్కువగా ఉండడం వల్ల ఈ పంటపై రైతుల్లో పెరుగుతోంది. పంట సాగు ప్రారంభించిన తరువాత నాలుగైదు సంవత్సరాలు కష్టపడితే ఆ తరువాత ఎక్కువ శ్రమించకుండానే ఫలితం పొందే అవకాశం ఉంటుంది. అతి తక్కువ ఖర్చుతో పండే ఈ పంట గాలివాన వీచినా ఎలాంటి నష్టం వాటిల్లదు. చీడలు, పురుగుల బెడద తక్కువగా ఉంటుంది. ఎకరానికి 10టన్నులకు తక్కువ కాకుండా దిగుబడి వస్తుంది. ఖర్చులు పోనూ ఎకరాకు లక్ష రూపాయలకు పైగానే ఆదాయం పొందడానికి అవకాశం ఉంది. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు ఏయే మండలాలు అనుకూలంగా ఉన్నాయనేది ఉద్యాన శాఖ అధికారులు గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రయత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించే విధంగా చర్యలు చేపడుతున్న ఈ సమయంలోనే ఆయిల్ పామ్ సాగుకు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. జిల్లాలో ఈ ఏడాది 2వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేయాలన్న లక్ష్యంతో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి

జిల్లాలో ఆయిల్ పామ్ సాగు ప్రారంభించేందుకు ఆసక్తి కనబరుస్తున్న రైతులను ప్రోత్సహించాలని పలుమార్లు జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశాల్లో పలువురు సభ్యులు ఉద్యాన శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. మన వద్ద వంటనూనె వినియోగం అధికంగా ఉంటున్న నేపథ్యంలో విదేశాల నుంచి పామాయిల్ గింజలను దిగుమతి చేసుకుంటున్నారు. వంటనూనెకు ఉపయోగపడే పంటలను పండించే దిశగా రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ ప్రోత్సహకాలు అందజేస్తున్నాయి. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఆయిల్ పామ్ సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించడంతో పాటు అటవీ శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మొక్కల నర్సరీలు కూడా ఏర్పాటు చేసే అవకాశం కూడా ఉంది. ఆయిల్ పామ్ సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

603 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తి ..

ఈ ఏడాది జిల్లాలో 2 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్‌సాగును ప్రోత్సహించాలని ఉద్యాన వన శాఖ అధికారులు నిర్ణయించగా, ఇప్పటి వరకు 603 ఎకరాల్లోనే ఆయిల్ పామ్ ప్లాంటేషన్ పూర్తి చేశారు. మరో వెయ్యి ఎకరాల్లో ప్లాంటేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు పట్ల అధిక సంఖ్యలో రైతులు ఆసక్తి కనబరుస్తున్నా ఇప్పటి వరకు 162 మంది రైతులు మాత్రమే ప్లాంటేషన్ చేసుకున్నారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులను ప్రభుత్వ పరంగా ప్రోత్సహిస్తే జిల్లాలో వేలాది ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది.

ఆక్రమణలపై ఆరా!

ప్రత్యేక దృష్టి సారించిన 'హైడ్రా'

- » కబ్జాలకు గురైన చెరువు శిఖం
- » ఏళ్లుగా ఫిర్యాదులను ట్టించుకోని ఉన్నతాధికారులు
- » హైడ్రా ఏర్పాటుతో స్థానికుల్లో చిగురిస్తున్న ఆశలు



కబ్జాలతో కుచించుకుపోయిన మేడ్చల్ పెద్దచెరువు వాగు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 18: చెరువు, కుంటలు, ప్రభుత్వ స్థలాలను కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎసేట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)తో మేడ్చల్‌లో హల్‌చల్ మొదలైంది. ఇదివరకు చెరువులు, కుంటలు, నాలాలు కబ్జాకు గురవుతున్నాయి మొర్రో అంటూ స్థానికులు కొన్నేళ్లుగా అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం చెరువు, కుంటల స్థలాలను కాపాడటానికి హైడ్రా రంగంలోకి దిగడంతో స్థానికుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. రెండు దశాబ్దాల కాలంలో మేడ్చల్ ప్రాంతంలో రియల్‌స్టేట్ వ్యాపారం గణనీయంగా అభివృద్ధి చెందింది. ఈ అభివృద్ధి ముసుగులో చెరువులు, కుంటలు, నాలాల స్థలాలకు రక్షణ లేకుండా పోయింది. రూ.కోట్లు విలువ చేసే చెరువులు, కుంటలు, నాలాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌కు సంబంధించిన భూములు అన్యాక్రాంతం పట్ల అధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఫలితం లేకుండాపోయింది. చెరువులు, కుంటలు, బఫర్ జోన్ స్థలాల్లో, ఎఫ్‌టీఎల్ ఆధీన భూముల్లో అనుమతి పొంది చేపట్టిన నిర్మాణాలను సైతం కూలగొట్టడానికి వెనుకాడబోమని హైడ్రా ప్రకటించడంతో స్థానికులు తమ వద్ద జరిగిన కబ్జాల పట్ల ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఉన్నతాధికారులకు చేసిన పాత ఫిర్యాదులను తిరగతోడే పనిలో నిమగ్నమయ్యారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు మండలాల్లోని పలు గ్రామాల్లోని చెరువులకు చెందిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూముల్లో వెంచర్లు చేసి ప్లాట్లుగా మార్చి విక్రయించిన దాఖలాలు ఉన్నాయి.

కబ్జాలతో కుచించుకుపోయిన మేడ్చల్ పెద్ద చెరువు వాగు

ఈ మధ్య కాలంలో మేడ్చల్ పెద్దచెరువు వాగు ఇరువైపులా పెద్ద ఎత్తున వెంచర్లు వెలిశాయి. వాగు మేడ్చల్ పట్టణం నుంచి కిష్టాపూర్, రావల్‌కోల్, రాజబొల్లారం, పూడూరు, ఘణ్‌పూర్ గ్రామాల మీదుగా శామీర్‌పేట పెద్ద చెరువులో కలుస్తుంది. చెరువులో కొందరు రియల్టర్లు వాగు స్థలాన్ని దర్జాగా కబ్జా చేసి పెద్దవాగును చిన్నపాటి నాలాగా మార్చేశారు. కొన్ని ప్రాంతాల్లో రియల్టర్లు పైప్‌లైన్ వేసి వాగు మార్గాన్ని మూసేశారు. మరి కొందరు అనుమతి లేకుండా వాగుపై వంతెన ఏర్పాటు చేసి వాగు ఉనికి దెబ్బతీసే విధంగా నిర్మాణాలు చేపట్టారు.

సమస్యాత్మక చెరువు కుంటలు

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 130లో 11 ఎకరాల 04 గుంటలు, మైసమ్మగూడ సర్వే నెంబర్ 617లోని 30 ఎకరాల 8గుంటల కోమటికుంట చెరువు, కాజిగూడ సర్వేనంబర్ 29లోని 14 ఎకరాల 3గుంటల సుమారు చెరువు, సర్వేనంబర్ 248లోని 5 ఎకరాల 5 గుంటల నీలం చెరువుకు సంబంధించిన స్థలాలు కబ్జాకు గురైనట్లు స్థానికులు ఇదివరకు అధికారులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా కండ్లకోయ గ్రామ పరిధిలోని పాల్కుమ్ చెరువు, నాగుల కుంట, ఎర్ర కుంట, మర్రికుంట చెరువుల విస్తీర్ణం కబ్జాల కారణంగా పూర్తిగా తగ్గిపోయింది. పూడూరు గ్రామపంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 384, 385 చెరువు కాల్వను కబ్జా అయినట్లు అధికారులకు ఫిర్యాదు చేసిన దాఖలాలు ఉన్నాయి. మేడ్చల్ పెద్దచెరువు 96ఎకరాల విస్తీర్ణంలో ఉండగా చెరువు పరిసరాల్లోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ భూముల్లో నిర్మాణాలు పెద్దఎత్తున చేపట్టారు. డబీల్‌పూర్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచర్లు చేసి ప్లాట్లు విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి.



నారా చెరువు పరిసరాల్లో డంప్ చేసిన మట్టి



కండ్లకోయ మర్రికుంట పరిసరాల్లో చేపట్టిన నిర్మాణాలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో కబ్జాకు గురైన చెరువు కుంటల విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ప్రస్తుతం హైడ్రా నిస్పక్షపాతంగా వ్యవహరిస్తుందన్న నమ్మకం లేదు. కబ్జాలు చేసిన వారికి అధికార పార్టీ అండదండలు ఉన్నాయి. తమ వద్ద జరిగిన కబ్జాల పై హైడ్రా కొరడా ఝుళిపించి నిర్మాణాలు తొలగిస్తే తప్పా, ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలగదు.

- దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, గుండ్లపోచంపల్లి

పెద్ద చెరువు వాగు కబ్జా నుంచి కాపాడాలి



రియల్టర్ల కబ్జాతో మేడ్చల్ పెద్ద చెరువు వాగు పూర్తిగా కుదించుకు పోయింది. వాగు కబ్జాపట్ల స్థానికులు అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేశారు. ఐనప్పటికీ వారు చూసీచూడనట్లు వ్యవహరించారు. వాగుకు ఆనుకుని ఉన్న హెచ్ఎండీఏ వెంచర్ల నిర్వాహకులు సైతం వాగు స్థలాన్ని కబ్జాచేసి పార్కులు ఏర్పాటు చేసినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోలేదు.

- అత్వెల్లి సందీప్ గౌడ్, మేడ్చల్



స్పీకర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

అక్కాచెల్లెళ్లకు తోడుగా ఉండాలి

» స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, ఆగస్టు 18 : నిర్మలమైన మనస్సుతో అక్కాచెల్లెళ్లకు తోడుగా ఉండాలని రక్షబంధన్ తెలియజేస్తుందని స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని ఓంశాంతి భవనంలో నిర్వహించిన రక్షాబంధన్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనగా బ్రహ్మకుమారీస్ మధు అక్కయ్య స్పీకర్‌కు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లకు తోడుగా ఉండాలని సూచించారు. ఓంశాంతి భవనంలో బ్రహ్మకుమారీలు మంచి బోధన చేస్తారని, ఇక్కడికి వస్తే విజ్ఞానం పెరిగి మనస్సు ప్రశాంతంగా ఉంటుందని స్పష్టం చేశారు. సమయం ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ జ్ఞాన కేంద్రానికి వచ్చి మంచి విషయాలు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, మాజీ హౌసింగ్ బోర్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్‌గోపాల్, ఎర్రవల్లి జాఫర్, బ్రహ్మకుమారి మధు అక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి

చౌదరిగూడ, ఆగస్టు 18: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లేడ్ చౌదరిగూడ మండలం చింతకుంట వాసులు అన్నారు. ఆదివారం తండాలో యువకులు, నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి ఆకాశ్ మాట్లాడుతూ.. విధుల్లో ఉన్న డాక్టర్‌పై లైంగిక దాడి చేసి చివరకు ప్రాణాలు బలిగొన్న నిందితులను వెంటనే గుర్తించి ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. వైద్యురాలి కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఠల్‌నాయక్, రామ్‌చరణ్, సునిల్‌రెడ్డి, రవినాయక్, రాహుల్, అజయ్‌నాయక్, అనిల్‌నాయక్, శంకర్‌నాయక్, గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

బురదలో కూరుకుపోయిన లారీ



అంతారం తండా సమీపంలో బురదలో కూరుకుపోయిన లారీ

తాండూరు రూరల్, ఆగస్టు 18: ఇటీవల కురిసిన వర్షాలకు తాండూరు మండలం అంతారం తండా సమీపంలోని ఔటర్ రింగ్‌రోడ్డు బురదమయంగా మారింది. ఈ విషయం తెలియని హెవీ లారీ డ్రైవర్లు రోడ్లపై లారీలు నడపటంతో బురదలో ఇరుక్కుపోయారు. దీంతో 3-4 లారీల వరకు ఆదివారం ఇరుక్కుపోయాయి. అయితే హైదరాబాద్ నుంచి కరన్‌కోట్ వెళ్లేందుకు కొంత మంది లారీ డ్రైవర్లు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ సమీపంలోని ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి షార్ట్‌కట్‌లో వెళ్లేందుకు లారీలను నడుపుతుంటారు. ఇందులో భాగంగా అధిక వర్షం కురియడంతో రోడ్డంతా బురదమయంగా మారి లోడ్ లారీలన్నీ ఇరుక్కుపోయినట్లు అంతారం తండాకు చెందిన రామునాయక్ తెలిపారు. వారం రోజుల క్రితం బురదమయంగా ఉన్నప్పటికీ కొంత దూరం వరకు భూకైలాస్ వ్యవస్థాపకులు వాసుపవార్ నాయక్ జేసీబీ యంత్రంతో నాపరాతి ముక్కలు వేయించి చదును చేయించారు. అయినప్పటికీ శనివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి రోడ్డంతా బురదమయం కావడంతో లారీలు ఇరుక్కుపోయినట్లు తెలిపారు. ఈ విషయంపై స్థానిక శాసన సభ్యులు మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు రామునాయక్ తెలిపారు.

సయ్యద్‌పల్లిలో రైతుల సంబురాలు



సయ్యద్‌పల్లి గ్రామంలో స్వీట్లు తినిపించుకుంటున్న రైతులు

పరిగి, ఆగస్టు 18: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన సందర్భంగా ఆదివారం పరిగి మండలం సయ్యద్‌పల్లి గ్రామంలో సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి ఆధ్వర్యంలో సయ్యద్‌పల్లి గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం రైతులతో స్వీట్లు తినిపించుకుని సంబురాలు జరుపుకున్నారు. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసి చరిత్రలో సీఎం రేవంత్‌రెడ్డి నిలిచిపోతారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు గణేశ్, నాయకులు నర్సిరెడ్డి, అన్వర్, తలారి రాములు, వెంకటయ్య, రమేశ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థకు అప్పగించొద్దు

కొడంగల్, ఆగస్టు 18: ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థకు అప్పగించొద్దని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య అన్నారు. కొడంగల్‌లో ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్వచ్ఛంద సంస్థకు అప్పగించడంతో కార్మికులు జీవనోపాధిని కోల్పోవాల్సి వస్తోందన్నారు. ఏళ్లుగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులుగా కొనసాగుతున్న వారిని అన్యాయం చేయరాదన్నారు.

ఉత్సాహంగా పౌరాణిక నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శనలో కుచేలుడు, సత్యభామ, శ్రీకృష్ణుడు పాత్రధారులు

శంకర్‌పల్లి, ఆగస్టు 18: మండలంలోని జన్వాడలో శ్రీకృష్ణాంజనేయ యుద్ధం, మయసభ, ఏకపాత్రాభినయం పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించారు. శనివారం రాత్రి పద్మారవీందర్‌గౌడ్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన శ్రీకృష్ణాంజనేయ యుద్ధం నాటకం చూపరులను అలరించింది. జన్వాడ, మీర్జాగూడ గ్రామస్తులు నాటకాన్ని తిలకించారు. నరహరిరాజు సంగీత దర్శకత్వంలో జనతా సేవాసమితి మహబూబ్‌నగర్ కళాకారులు నాటక ప్రదర్శన నిర్వహించారు. శ్రీకృష్ణుడిగా దుర్వాసరాజు, ఆంజనేయుడుగా ఎం.సంజీవయాదవ్, నారదుడిగా ఎం.తిరుపతయ్య, సత్యభామగా ఎం.రాధిక, రుక్మిణిగా రాజేశ్వరి, బలరాముడిగా హన్మంతు, గరుత్మంతుడిగా శంకర్, కుచేలుడి పాత్రధారుడి రాములు నాటకాలను రక్తి కట్టించారు. కళాకారుల నటన అలరించింది. నాటక ప్రదర్శనకు శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్, మీర్జాగూడ నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, నాగేందర్, మల్లేషం, గౌడిచర్ల వెంకటేష్ హాజరయ్యారు.

సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుందాం



బోనాల వేడుకలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఆదిభట్ల, ఆగస్టు 18 : పండుగలు, వేడుకలు, గ్రామీణ సంప్రదాయాలు వంటి సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదిభట్ల పరిధి బొంగులూరు గంగానగర్ కాలనీలో ఆదివారం అమ్మవారి బోనాలు నిర్వహించారు. మహిళలు ఆలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించారు. చైర్మన్, కౌన్సిలర్ మౌనిక, కనకదుర్గ ఆలయ చైర్మన్ అరుణనర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, ఉదయ్‌పాల్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకున్నారు. వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలకుండా ఔషధ గుణాలు కలిగిన పసుపు, కుంకుమ, మామిడి, వేప తదితర వస్తువులను వినియోగిస్తూ జరుపుకునే పండుగ బోనాలు అని అన్నారు. ఇది మనకు పూర్వీకులు అందించిన గొప్ప వారసత్వమని చైర్మన్ అన్నారు. ప్రజలు సామూహికంగా జరుపుకునే పండుగలను భావితరాలకు అందించాలని కోరారు.

అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ



ఎమ్మెల్యే శంకర్‌ను కలిసిన రైతులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 18: అర్హత కలిగిన ప్రతీ రైతుకు రుణమాఫీ వస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయానికి ఆదివారం కొందుర్గు మండల రైతులు వచ్చి ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మూడు విడతల్లో రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలుపుకున్నారన్నారు. సాంకేతిక కారణాలతో కొందరికి ఇప్పుడు రాకున్నా త్వరలోనే వారికీ రుణమాఫీ వర్తిస్తుందన్నారు. షాద్‌నగర్‌లోని బరోడా బ్యాంక్ బ్రాంచిలో సాంకేతిక లోపంతో మొదటి విడతలో 500మందికి రుణమాఫీ రాలేదని తెలిసిన వెంటనే బ్యాంకర్లతో మాట్లాడి సమస్యను ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి, రాష్ట్ర కమిషనర్ దృష్టికి తీసుకుపోయి రుణమాఫీ చేయించామని తెలిపారు. ఇప్పుడు కూడా రుణమాఫీ రాని రైతులు వ్యవసాయశాఖ ఆఫీసులో దరఖాస్తు చేసుకుంటే, నెలరోజుల్లో అర్హతున్న వారందరికీ రుణమాఫీ వస్తుందని తెలిపారు. పదేళ్లలో రుణమాఫీ చేయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్ రావు రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులు ఆత్మహత్య చేసుకున్నా పట్టించుకోని బావబామ్మర్దులు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే రైతులు ఊరుకోరు అని హెచ్చరించారు. ప్రజాహితానికి పాటుపడుతున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం కేటీఆర్, హరీష్‌రావులు మానుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వై.యాదయ్యయాదవ్, చెన్నయ్య, శివశంకర్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకే కుట్ర రాజకీయాలు



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, ఆగస్టు 18 : రుణమాఫీతో రైతులు ఆనందపడుతుంటే జీర్ణించుకోలేని విపక్షాలు విషప్రచారాలకు ఒడిగట్టాయని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు 2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కడ్తాలలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేఖరులతో ఆయన మాట్లాడారు. రుణమాఫీపై అపోహలు, అనుమానాలకు తావులేదన్నారు. సాంకేతిక, ఇతర కారణాలతో ఎవరైనా రైతులకు రుణమాఫీ కాకున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో తిరిగి రికార్డు చేసుకొని అర్హులకు రుణమాఫీని తప్పక వర్తింపజేస్తారన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతుల్లో ఆనందాన్ని చూడడమే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయం అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, నాయకులు శంకర్, భానుకిరణ్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

బషీరాబాద్‌లో అసంపూర్తిగా భోజనశాల



బషీరాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా భోజనశాల భవనం

బషీరాబాద్, ఆగస్టు 18: బషీరాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు) ఆవరణలో చేపట్టిన భోజనశాల భవన నిర్మాణం పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మనఊరు-మనబడి కింద ఏడాదిన్నర కిందట ఈ భోజనశాల భవనం మంజూరు కాగా పిల్లర్లు వేసి, పైకప్పు రేకులు బిగించారు. అనంతరం ఎడెనిమిది నెలలు గడిచాక ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి. ఇక్కడి పాత భవనంలో వండి పెట్టగా చెట్లకింద కూర్చుని విద్యార్థులు భోజనం చేస్తున్నారు. ఇదిలా ఉండగా చేసిన పనికి సకాలంలో బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు పూర్తి చేయలేకపోతున్నానని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఈ విషయమై ఏఈ లక్ష్మణ్‌ను వివరణ కోరగా నిధులు లేక బిల్లులు అందలేదనే విషయం వాస్తవమేనన్నారు. ఈక్రమంలో పలు పాఠశాలల్లో భోజనశాల పనులు పూర్తికాలేక అసంపూర్తిగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రేమానురాగాల రక్షాబంధన్

- అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల ఆప్యాయతకు ప్రతీక
- నేడు రాఖీపౌర్ణమి వేడుక
- పుట్టిళ్లకు చేరుకుంటున్న ఆడపడచులు



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు, యువతులు

ఆమనగల్లు, ఆగస్టు 18: అక్కా తమ్ముడు, అన్నా చెల్లెల్ల అనుబంధానికి, ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి. 'నేను నీకు రక్ష. నువ్వు నాకు రక్ష.' తోబుట్టువుల బాంధవ్యంతో పాటు దేశభక్తి పెపొందించే పండుగ రక్షాబంధన్. తోబుట్టువుల అనుబంధానికి గుర్తుగా హిందువులు జరుపుకునే పండుగల్లో రాఖీపౌర్ణమి ప్రత్యేకమైనది. సోమవారం(నేడు) రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నారు. అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కడుతారు. పెళ్లయిన ఆడపడచులు పుట్టిళ్లకు చేరుకుంటున్నారు. భారతీయ సంస్కృతిలో రక్షాబంధన్‌కు ఎంతో ప్రాధాన్యం వుంది. రాఖీ అనేది రంగుల దారమే కాదు. సోదరుల జీవితాలను రంగులమయం చేయాలని ఆకాంక్షిస్తూ అక్కాచెల్లెల్లు కట్టేది రాఖీ. తోబుట్టువుల కష్టసుఖాల్లో ఆత్మీయ బంధాన్ని, మమతానురాగాలను గుర్తుచేసేది రక్షాబంధన్. యేటా కొన్ని వర్గాల వారు సంప్రదాయం ప్రకారం గాయత్రీ స్వరూపంగా భావించే జంధ్యాన్ని రాఖీ పౌర్ణమి రోజున ధరిస్తారు. యేటా శ్రావణ పౌర్ణమి రోజున రక్షాబంధన్ జరుపుకుంటారు.

కులమతాలకు అతీతంగా

రక్షాబంధనానికి చారిత్రక వైశిష్ట్యం ఉంది. సోదరభావంతో మెలిగేవారందరికీ మహిళలు రాఖీ పౌర్ణమి నాడు రాఖీలు కడతారు. చీలుతున్న సమాజాన్ని ఒక్కటి చేసేలా, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని పాదుకొల్పేది రక్షాబంధన్ అనడంలో సందేహం లేదు. కుల, మతాలకు అతీతంగా రాఖీ పౌర్ణమిని జరుపుకుంటారు. మానవ, కుటుంబం సంబంధాలు పడిపోతూ ఆర్థిక సంబంధాలే ఎక్కువవుతున్న ఈ రోజుల్లో అనుబంధం, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచేది రాఖీ పౌర్ణమి అనడంలో సందేహం లేదు.



ఆకర్షణీయంగా రాఖీలు

అక్కాతుమ్ముళ్లు, అన్నాచెల్లెళ్లకు రాఖీపౌర్ణమి ఒక తీపిగుర్తు. సోదరులు ఎక్కడున్నా, ఏ స్థితిలో ఉన్నా వారు క్షేమంగా ఉండాలని కోరుకుంటూ ఆడపడచులు రాఖీ కడతారు.

ఆధునిక డిజైన్లలో రాఖీలు

కాలానికనుగుణంగా రాఖీల రూపురేఖల్లోనూ కొత్త పోకడలు సంతరించుకున్నాయి. యేటా రకరకాల రాఖీలు వస్తున్నాయి. ఆమనగల్లులోని రహదారులపై ఎక్కడ చూసినా రాఖీల విక్రయ దుకాణాలు వెలిశాయి. శ్రీశైలం-హైదరాబాద్ రహదారి పక్కన, ఆమనగల్లు-మాడ్గుల, ఆమనగల్లు-తలకొండపల్లి రోడ్ల వెంట రాఖీల స్టాళ్లను ఏర్పాటు చేశారు. వ్యాపారులు హైద్రాబాద్, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి రాఖీలను తెచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. నాలుగైదు రోజుల పాటు మార్కెట్‌లో రాఖీల సందడి నెలకొంది.

పెరిగిన ధరలు

రాఖీ డిజైన్, రకం, సైజులను బట్టి రూ.30 నుంచి రూ.500 ధర ఉన్నారు. వెండి రాఖీలనూ విక్రయిస్తున్నారు. రాఖీల కొనేందుకు వస్తున్న ఆడపడచులతో దుకాణాల్లో రద్దీ నెలకొంది. ఈ యేడాది రాఖీల ధరలు పెరిగాయి. గతం కంటే 15 నుంచి 30శాతం వరకు ధరలు పెంచేశారు.



పోచమ్మ ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు



ఎంపీ డీకే అరుణను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

వైభవోపేతంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు

- హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే
- వేలాదిగా తరలొచ్చిన భక్తులు

కొత్తూర్, ఆగస్టు 18: కొత్తూర్‌లో గ్రామ దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ నెల 16న ప్రారంభమైన పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ ఆలయాల పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. రూ.2కోట్లతో దాతల సహకారంతో మున్సిపాలిటీలో మూడు పోచమ్మ, నాలుగు మైసమ్మ ఆలయాలు, ఎల్లమ్మ ఆలయం, ఇతర దేవతామూర్తుల పునఃప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించారు. ప్రాతఃకాల పూజ, గురు ప్రార్థనం, రత్నంన్యాసం, ధాతున్యాసం, ఉత్తరాషాఢ నక్షత్రాన పోచమ్మ, మైసమ్మ, పరివార దేవతలకు ప్రాణప్రతిష్ఠ చేశారు. హోమం, అమ్మవారి దర్శనం, కుంబాభిషేకం, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సత్తెనపల్లి శ్రీ శక్తి దుర్గాపీఠాదిపతి అనుమతిస్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పూర్తిచేశారు. కొత్తూర్ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే.అరుణ, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్ దేవలతను దర్శించుకొని పూజలుచేశారు. వారు మాట్లాడుతూ గ్రామ దేవతల పునఃప్రతిష్ఠ కార్యక్రమం చేయడం శుభసూచకం అని, ప్రజలకు సుఖసంతోషాలు కలుగుతాయన్నారు. ముఖ్య అతిథులను నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. కౌన్సిలర్లు, రాజకీయ పార్టీల నాయకులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్ని అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.



పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కందుకూరులో ఘనంగా బోనాలు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కేఎల్లార్

కందుకూర్, ఆగస్టు 18: కందుకూరులో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆడపడచులు బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఈ ఉత్సవాల్లో మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. నిర్వాహకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బొక్క జంగారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, శమంతకమణి, మల్లేశ్, జగన్, ప్రశాంత్ చారి, జగన్, భూపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణను కలిసిన ఎమ్మార్పీస్ నాయకులు



మంద కృష్ణతో స్థానిక నాయకులు

శంకర్‌పల్లి, ఆగస్టు 18: ఎమ్మార్పీస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణను నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మంద కృష్ణ కృషి ఫలితంగానే ఎమ్మార్పీస్ ఉద్యమం 30ఏళ్లు కొనసాగిందన్నారు. మాదిగ, 57 ఉపకులాలకు ఎస్సీ వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్లు వర్తింపజేయొచ్చని ఆగస్టు 1న సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పునివ్వడం సంతోషకరం అన్నారు. కోర్టు తీర్పుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంద కృష్ణను కలిసిన వారిలో రవికుమార్, పరశురామ్ తదితరులు ఉన్నారు.

20నుంచి శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

కొడంగల్, ఆగస్టు 18: ఈ నెల 20 నుంచి కొడంగల్ పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో ఆరాధానోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ సేవా సమితి సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20న సుప్రభాతంతో ప్రారంభమయ్యే పూజల్లో భాగంగా పంచామృతభిషేకం, అష్టోత్తర పారాయణం, తులసి అర్చన, మంగళహారతి, బజనలు, పల్లకీ సేవ, అష్టావధానము, 21న రథోత్సవం, భజనలు, 22న భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మున్సిపాలిటీ ఎదుటే అక్రమ వెంచర్

- రూ.25 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా!
- పత్తాలేని టౌన్‌ప్లానింగ్ అధికారులు
- కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు

తాండూరు, ఆగస్టు 18: తాండూరు నడిబొడ్డున మున్సిపాలిటీకి కూతవేటు దూరంలో అనుమతులు లేకుండా అక్రమ వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపాలిటీ అధికార యంత్రాంగం రోజూ ఆ వెంచర్ పక్క నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. కానీ అనుమతులు లేకుండానే రోడ్లు వేస్తున్న ఈ అధికారులకు అక్రమ వెంచర్ కనపడటం లేదా? స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సర్వే నం.129, 130లలో ఎలాంటి అనుమతులు లేకుండా వారం రోజులుగా అక్రమ లేవుట్ చేసి ప్లాట్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. ఇందులో సర్వే నం.130 ప్రభుత్వ భూమి. రూ.25కోట్ల విలువైన ప్రభుత్వ భూమికే ఎసరు పెట్టారు. గతంలో ఈభూమిపై ఫిర్యాదులు రాగా ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయరాదని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. అయినప్పటికీ అప్పటి తహసీల్దార్ నిర్లక్ష్యం వల్లే ఈ భూమి అక్రమణకు గురైందనే ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత యజమాని గానీ డెవలపర్ గానీ లేవుట్‌ను అభివృద్ధి చేయాలనుకుంటే ఆన్‌లైన్‌లో అనుమతులు కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు మున్సిపాలిటీకి డెవలప్‌మెంట్ చార్జీలు, ఇతర అనుమతుల ఫీజులు స్వైయర్ ఫీటు చొప్పున చెల్లించాలి. మున్సిపాలిటీకి లేవుట్‌లో పార్కు లేదా ప్రభుత్వ భవనాల నిమిత్తం కొంత భూమిని (మార్టిగేజ్) కేటాయించి మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేయించాలి. ఇవన్నీ లేవని తెలిసీ మున్సిపల్ టౌన్‌ప్లాన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే 13 ప్లాట్లు చేసి విక్రయించినట్లు సమాచారం.



తాండూరులోని లారీ పార్కింగ్ సమీపంలో అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్, రోడ్డు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం



అక్రమ వెంచర్ నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల విక్రయంపై వికారాబాద్ కలెక్టర్‌కు, మున్సిపల్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం. సర్వే నం. 129 పట్టాభూమిని ఆనుకొని పక్కనే ఉన్న సర్వే నెం.130లోని ప్రభుత్వ భూమిని అక్రమించుకొని ప్లాట్లు చేయడాన్ని ఆపివేయాలి. మున్సిపాలిటీ అధికారులు అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలి. - సూరజ్ సింగ్ ఠాకూర్, మాజీ కౌన్సిలర్, తాండూరు

ఉద్యోగం నుంచి తొలగించారని ధర్నా



సోలార్ ప్లాంట్ ఎదుట ధర్నా చేస్తున్న దారులపల్లి గ్రామస్థులు

మర్పల్లి, ఆగస్టు 18: పది సంవత్సరాల పాటు ఉద్యోగం చేయించుకొని చెప్పకుండా ఉద్యోగం నుంచి తొలగించారని ఓ వ్యక్తి తన కుటుంబసభ్యులు, గ్రామస్థులతో కలిసి దారులపల్లి సోలార్ ప్లాంట్ ముందు ధర్నాకు దిగాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. బాధిత కుటుంబీకులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దారులపల్లి గ్రామానికి చెందిన ఫయోడ్డీన్ సోలార్ ప్లాంట్‌లో గత 10 సంవత్సరాలుగా ఏఎస్‌వో సూపర్‌వైజర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మూడు నెలల కిందట ఉద్యోగం నుంచి తొలగించామని, ఇక నుంచి రావొద్దని చెప్పడంతో ఆవేదనకు గురయ్యాడు. పదేళ్లుగా పని చేస్తున్నాను హఠత్తుగా తొలగించడం సరైంది కాదని ప్రాధేయపడినా కనికరించలేదు. సోలార్ ప్లాంట్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా రేపు, మాపంటూ మూడు నెలలుగా కాలయాపన చేయడంతో బాధితుడు కుటుంబసభ్యులు, గ్రామస్థులతో కలిసి సోలార్‌ప్లాంట్ ఎదుట గేటుకు తాళం వేసి ధర్నాకు దిగాడు. దీంతో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని సముదాయించి న్యాయం జరిగేలా చూస్తామని శాంతించారు.



ఘట్‌కేసర్‌లో పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



ఘట్‌కేసర్‌లో అమ్మవారికి బోనం తీసుకెళ్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావణి జంగయ్యయాదవ్

వైభవంగా బోనాల వేడుకలు

ఘట్‌కేసర్, ఆగస్టు 18: ఘట్‌కేసర్‌లో ఆదివారం బోనాల పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి భారీ ఏర్పాటు చేసారు. గ్రామదేవతలైన పోచమ్మ, మహంకాళి, మైసమ్మ, ఈదమ్మ, అమ్మవార్ల ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బోనాల పండుగ సందర్భంగా ఉదయం నుండే అమ్మవార్లను జనాలు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, వైస్‌చైర్మన్ పల్గుల మాధవరెడ్డి, నాయకులు ముత్యాలుయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గడీమైసమ్మ బోనాలు

మేడ్చల్ టౌన్: మేడ్చల్ పట్టణంలోని గడీ మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆవరణలో ఉన్న అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున విచ్చేసి దర్శించుకున్నారు. మహిళలు బోనాలు సమర్పించుకోగా యువకులు పలారం బండ్లతో ఊరేగింపుగా ఆలయానికి విచ్చేశారు. డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర బెవరేజేస్ సభ్యుడు నవీన్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్ కౌడె మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్: ఎన్టీఆర్ చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్నకు నివాళులర్పిస్తున్న గౌడసంఘం నాయకులు శ్రీనివాస్ గౌడ్, మల్లికార్జున్ గౌడ్



తాండూరు: సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు



పరిగి: సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు



పూడూరు: మన్నెగూడ చౌరస్తాలో సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గౌడసంఘం నాయకులు

ఘనంగా సర్దార్ పాపన్నగౌడ్ జయంతి

వికారాబాద్, మేడల్ జిల్లాలోని పలు మండలాల్లో విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతిని ఆదివారం గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ గోల్కొండ కోటపై మొదటగా జెండా ఎగరవేసి బహుజన రాజ్యాన్ని స్థాపించిన గొప్ప వీరుడు పాపన్నగౌడ్ అని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.



బొంరాస్‌పేట్: తుంకిమెట్లలో సర్దార్ సర్వాయి పాపన్నకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కులకచర్ల: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిలో వేడుకల్లో పాల్గొన్న నాయకులు



తాండూరు: సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు



దౌల్తాబాద్: సర్దార్ సర్వాయి పాపన్నకు నివాళులర్పిస్తున్న నాయకులు



తాండూరు రూరల్: కరన్‌కోట్‌లో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్థానికులు



బంట్వారం: సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు



శామీర్‌పేట: సర్వాయి పాపన్న గౌడ్‌కు నివాళులర్పిస్తున్న గౌడ్ సంఘం నాయకులు

అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుంది



కులకచర్లలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ మొగులయ్య

కులకచర్ల, ఆగస్టు 18: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని, రైతులు దిగులు చెందాల్సిన అవసరం లేదని సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. కులకచర్లలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీలో కులకచర్ల సొసైటీ పరిధిలో మూడు విడతలుగా 736మంది రైతులకు రుణమాఫీ వచ్చిందని తెలిపారు. రూ.1లక్ష లోపు 412మంది రైతులు, రూ.1.5లక్షలోపు 213మంది, రూ.2లక్షల లోపు 111 మంది రైతులకు రూ.5.18కోట్లు రుణమాఫీ అయిందని తెలిపారు. మిగతా 572మందికి రుణమాఫీ కావాల్సిఉందన్నారు. వారికి కూడా రుణమాఫీ వర్తిస్తుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు వెంకటయ్యగౌడ్, వెంకటేశ్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ భవన నిర్మాణం పూర్తిచేస్తాం



మాట్లాడుతున్న లొంక నర్సింహులు

పెద్దేముల్, ఆగస్టు 18: పట్టణంలో ముదిరాజ్ భవన నిర్మాణం త్వరలో చేపట్టి పూర్తిచేస్తామని ముదిరాజ్ సంఘం వికారాబాద్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు లొంక నర్సింహులు అన్నారు. మండల కేంద్రంలోని శంభులింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఆదివారం ముదిరాజ్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లొంక నర్సింహులు మాట్లాడుతూ.. తాండూరు పట్టణ సమీపంలో బైపాస్‌రోడ్డు పక్కన ముదిరాజ్ సంఘానికి తాండూరు ఎమ్మెల్యే స్థలం కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముదిరాజ్‌ల అభ్యున్నతికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఎంతో సహకారం అందిస్తున్నారని అన్నారు. ముదిరాజ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించడం పూర్తయినందున వెంటనే అక్కడ భవన నిర్మాణ పనులు చేపట్టి త్వరగా పూర్తిచేస్తామని తెలిపారు. అయితే భవన నిర్మాణానికి ముదిరాజ్ సంఘం సభ్యులు ఆర్థికంగా సహకారం అందించాలని కోరారు. త్వరలో ముదిరాజ్ సంఘం సభ్యత్వ నమోదు కూడా ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లేశం, నాయకులు ఉత్తంచంద్, బాతుల వెంకట్, లొంక రాములు, బుద్దారం వెంకటయ్య, చంద్రశేఖర్, వెంకటేష్, అనంతయ్య, అంజిలయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



చంద్రయ్య

పెద్దేముల్, ఆగస్టు 18: గోపాల్‌పూర్ మాజీ సర్పంచ్ చంద్రయ్య చికిత్స పొందుతూ మృతిచెందారు. పెద్దేముల్ మండలం గోపాల్‌పూర్ మాజీ సర్పంచ్ చంద్రయ్య వారం రోజుల క్రితం బాత్‌రూంలో జారిపడడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం చంద్రయ్య అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు పలువురు రాజకీయ నాయకులు హాజరయ్యారు.

బీఆర్‌ఎస్ శామీర్‌పేట మండల అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి

శామీర్‌పేట, ఆగస్టు 18: బీఆర్‌ఎస్ మండల నూతన అధ్యక్షుడిగా మజీద్‌పూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ సరసం మోహన్‌రెడ్డిని నియమిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే మల్లారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఆదివారం ఆయన మీడియాకు వివరించారు. ఇంతకు ముందుకు శామీర్‌పేట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా ఉన్న సుదర్శన్ గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి నూతనంగా బీజేపీలో చేరారు. అనంతరం దాదాపు మూడు నెలల పాటు శామీర్‌పేట మండల బీఆర్‌ఎస్ అధ్యక్ష పదవిలో పార్టీ అధిష్ఠానం ఎవరిని నియమించకపోవడం ఆ పదవి ఖాళీగా ఉంది. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి చొరవ తీసుకొని ఆదివారం మజీద్‌పూర్‌కు చెందిన మాజీసర్పంచ్ మోహన్‌రెడ్డిని శామీర్‌పేట మండల బీఆర్‌ఎస్ నూతన అధ్యక్షుడిగా నియమించారు. దీంతో మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకం, విశ్వాసాన్ని వమ్ము చేయకుండా శామీర్‌పేటలో పార్టీ పూర్వవైభవానికి కృషిచేస్తానని మోహన్‌రెడ్డి తెలిపారు.

పేదల ఉచిత వైద్యానికి నాదీ భరోసా

● పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఆగస్టు 18: పేదల ఉచిత వైద్యానికి తనదే భరోసా అని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని తన నివాసంలో ఆదివారం సీఎంఆర్‌ఎఫ్ కింద బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకానికి రూ.10లక్షలకు పెంచిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించనివారికి కూడా సీఎంఆర్‌ఎఫ్ కింద ఆదుకుంటామని తెలిపారు. పరిగి నియోజకవర్గ పేదలకు అన్ని రకాలుగా అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు మల్లేశ్ రిజాయ్ పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఆస్పత్రి ఎదుట మురుగును తొలగించాలి

తాండూరు, ఆగస్టు 18: తాండూరు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఐదు రోజుల నుంచి మురుగు నిలిచి దుర్వాసన వస్తున్నా మున్సిపల్ యంత్రాంగం అధికారులు పట్టించుకోవడం లేదని, యుద్ధప్రతిపాదికన నీటిని తొలగింపజేయాలని తాండూరు పట్టణ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆస్పత్రి ప్రధాన గేటు ముందు నిలిచిన నీటిని ఆదివారం పరిశీలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ శాశ్వత చర్యలు చేపట్టాలని, లేదంటే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ తాండూరు పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు అన్నారు. వారి వెంట పార్టీ పట్టణ కమిటీ ఉపాధ్యక్షులు ప్రకాష్, పట్టణ కార్యదర్శి అంతారం కిరణ్ కుమార్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షాబుద్దీన్ పాల్గొన్నారు.



తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఎదుట నిలిచిన డ్రైనేజీ నీటిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా సుభాష్ చంద్రబోస్ వర్ధంతి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 18: స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్ ఆధ్వర్యంలో అత్వెల్లిలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అంబేడ్కర్‌కు ఘన నివాళి

ఘట్‌కేసర్, ఆగస్టు 18: ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో ఎంసీపీఐయూ పీర్జాదిగూడ మున్సిపల్ కార్యదర్శి మూడి మార్టిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలవు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, దాసు, జయరాజ్, ఈశ్వర్, శ్రీనివాస్, నర్సింగ్‌రావు, సత్యం, రాజేష్, మహిపాల్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన



అవుషాపూర్‌లో గ్రామదేవతల విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ ఏనుగు కావేరిమశ్చేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 18: మండలంలోని అవుషాపూర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. విగ్రహదాత, మాజీ సర్పంచ్ ఏనుగు కావేరిమశ్చేందర్‌రెడ్డి గ్రామదేవతలైన ముత్యాలమ్మ, పోచమ్మ, మైసమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మచ్చ సుదర్శన్, విశ్వనాథం, ప్రభాకర్, వెంకటేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

తాండూరు ముస్లిం వెల్ఫేర్‌లో ముసలం

● నలుగురు సభ్యులను తొలగిస్తూ తీర్మానం

తాండూరు, ఆగస్టు 18: తాండూరు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నెలకొన్న విభేదాలు సభ్యులను తొలగించేదాక వెళ్లింది. తాండూరు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కమాల్ అత్తార్ ఆధ్వర్యంలో ఆదివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న హదీషాహరి, కుర్షీద్ హుసెన్, సర్దార్ ముజాయిద్, అబ్దుల్ రహీమ్‌లను అసోసియేషన్ నుంచి తొలగిస్తున్నట్లు కార్యదర్శి సైపుల్లా ప్రకటించారు. అసోసియేషన్‌కు చెందిన షాపుల అద్దెలను ఎవరికీ ఇవ్వరాదని సంస్థ ఖాతాలో జమ చేయాలని అద్దెదారులకు సూచించారు. ఏళ్ల తరబడి ఉన్న అద్దెదారులను తొలగించాలని తీర్మానించారు. ఆదాయ, వ్యయాలను సభకు వివరించారు. పేద ముస్లింలకు సాయపడేలా సేవా కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని తీర్మానించారు. తొలగించిన సభ్యుల స్థానంలో కొత్తవారిని నియమించేందుకు కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **నవాబుపేట:** అక్నాపూర్ గ్రామానికి చెందిన ఊరెంట బందెమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు రూ.20వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

● **తాండూరు రూరల్:** తాండూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వంశీధర్‌రెడ్డి వివాహం ఆదివారం మేడ్చల్ జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ వివాహానికి వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, తాండూరు వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వ్యవసాయాధికారి యాదగిరి, మేడ్చల్ సబ్ ట్రెజరీ అధికారి శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయ విస్తీర్ణాధికారులు శ్రీనివాస్, శామెల్, జూనియర్ అసిస్టెంట్ నర్సిరెడ్డి, సిబ్బంది వివాహానికి హాజరయ్యారు.

● **బొంరాస్‌పేట్:** ఈనెల 23న కాంగ్రెస్ పార్టీ బొంరాస్‌పేట్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ కుమార్తె వివాహానికి రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఆదివారం హైదరాబాద్‌లో నర్సింహులుగౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి వివాహానికి రావాలని సీఎంకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● **వికారాబాద్:** పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడి ఆకాశం మేఘావృతమైంది. అనంతరం చిరు జల్లులతో కూడిన వర్షం సాయంత్రం వరకు కురిసింది. దీంతో పట్టణంలో ప్రజలు, ప్రయాణికులు కొంత ఇబ్బందులు పడ్డారు.

● **బషీరాబాద్:** మండలంలో నెలకొన్న పలు సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారం కావడంలేదని, బీజేపీ పార్టీ తరపున పోరాడుదామని వికారాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్‌కులకర్ణి పిలుపునిచ్చారు. బషీరాబాద్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఆదివారం బీజేపీ మండల స్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండలాధ్యక్షుడు రాఘవేందర్ నేతృత్వంలో పలు అంశాలపై ఆ పార్టీ నాయకులు ఇష్టాగోష్ఠిగా చర్చించారు. అనంతరం నవాంద్గీ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు, ఇరిగేషన్ సమస్యలు, ఎకాంబర రామలింగేశ్వరాలయం జాతర ఉత్సవాల్లో ప్రత్యేకమైన పార్కింగ్, హల్కోడా మీదుగా లింక్ రోడ్డు వంటి సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో బద్రేశ్వర్, పెంటయ్యగుప్తా, సంజీవరెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

● **తాండూరు:** రక్షాబంధన్‌ను పురస్కరించుకుని సోమవారం (నేడు) రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో రక్షా బంధన్ కార్యక్రమాలను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ ఆధ్వర్యంలో సాయంత్రం 7గంటలకు వినాయక కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేసినట్లు నగర కార్యవాహక్ తలారి గోపాల్ తెలిపారు. మున్సిపల్ కార్మికులు, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తల ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సామాజిక సమరసత జిల్లా ప్రముఖ్ వడ్ల శ్రీశైలం తెలిపారు.

● **శామీర్‌పేట:** కాంగ్రెస్ పార్టీ శామీర్‌పేట మండల నూతన ప్రధాన కార్యదర్శిగా మజీద్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు తుంకి రమేశ్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ప్రకటిస్తూ ఆదివారం ఉత్తర్వులను జారీచేశారు. అదేవిధంగా పార్టీ మండల నూతన ఉపాధ్యక్షుడిగా మజీద్‌పూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ సరసం అశోక్‌రెడ్డిని, ప్రధానకార్య దర్శిగా లాల్‌గడికి చెందిన చాట్లపల్లి నర్సింగ్‌రావులు నియమితులయ్యారు. నూతనంగా నియమితులైన వీరికి మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలు నియామక పత్రాలను అందజేశారు.

క్రైం కార్నర్

బాలుడి మృతదేహం లభ్యం



బాలుడు దేవాన్ష్ ఆనంద్ మృతదేహం

ముడుచింతలపల్లి, ఆగస్టు 18: శామీర్‌పేట పెద్దచెరువులో ఆదివారం బాలుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రానికి చెందిన మర్కంటి భానుప్రియ ఇద్దరు పిల్లలతో సహా శామీర్‌పేట పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు చేసుకున్న విషయం తెలిసిందే. కాగా శనివారం రాత్రి తల్లి, కూతుళ్ల మృతదేహాలను వెలికితీశారు. అయితే, బాలుడి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులు ఆదివారం తిరిగి గాలింపు చర్యలు చెపట్టగా ఎట్టకేలకు బాలుడు దేవాన్ష్ ఆనంద్(5) మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 18: యాక్టీవాను పాలవ్యాన్ వెనుకాల నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎదులాబాద్‌కు చెందిన కొమ్ము లక్ష్మయ్య(65) శనివారం తన భార్య యాదమ్మతో కలిసి యాక్టివాపై ఘట్‌కేసర్ నుంచి ఇంటికి వస్తుండగా ఎన్ఎఫ్‌సీనగర్, మదర్‌థెరిస్సా కళాశాల సమీపంలో వెనుకాల నుంచి యాక్టివాను పాలవ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్యకు ముఖం, కాళ్ల చేతులతో పాటు తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. యాదమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పతికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పాలవ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

గృహిణి అదృశ్యం



కట్ట లక్ష్మి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 18: గృహిణి అదృశ్యమైన ఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘనాపూర్‌కు చెందిన కట్ట లక్ష్మి(53) వారంరోజుల కిందట వైద్యంకోసం చౌదరిగూడ సాయినగర్‌లో ఉండే కుమారుడు సాయిప్రసాద్ ఇంటికి వచ్చింది. కాగా శనివారం సాయిప్రసాద్ మామ జోడిమెట్ల బస్టాండ్ వద్ద లక్ష్మిని స్టేషన్‌ఘనాపూర్ బస్ ఎక్కించాడు. కానీ ఆమె స్టేషన్‌ఘనాపూర్‌లో బస్సు దిగలేదని తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.

జ్యూస్ సెంటర్ నిర్వాహకుడికి రూ.10వేలు జరిమానా

తాండూరు, ఆగస్టు 18: ఈ నెల 16న తాండూరు పట్టణం ఇందిరాచౌక్‌లోని మిలాప్ జ్యూస్‌సెంటర్‌లో కుళ్లిన పండ్లు, ఫ్రూట్ సలాడ్‌లో పురుగులు వచ్చిన ఫిర్యాదుపై తనిఖీ చసిన మున్సిపల్ అధికారులు జ్యూస్ సెంటర్‌ను సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ కమిషనర్ ప్రత్యేక ఆదేశాలతో ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటయ్య ఆధ్వర్యంలో రూ.10వేలు జరిమానా విధించి అట్టి జ్యూస్ సెంటర్‌ను తెరిచారు. భవిష్యత్తులో ఇలాంటివి మళ్లీ పునరావృత్తమైతే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జవాన్లు వీరన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.



జరిమానా రసీదును అందజేస్తున్న ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య

రాఖీలకు భలే గిరాకీ

కొడంగల్ రూరల్, ఆగస్టు 18: రాఖీ పండుగను పురస్కరించుకుని కొడంగల్ పట్టణంలో రాఖీ దుకాణాలు వెలిశాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు ఆదివారం రాఖీలను కొనుగోలు చేయడంతో సందడి నెలకొంది. రాఖీలను వివిధ ఆకృతుల్లో అందంగా తీర్చిదిద్ది విక్రయించడంతో మహిళలు, చిన్నారులు ఆసక్తిగా కొనుగోలు చేశారు.



కొడంగల్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

వికారాబాద్, ఆగస్టు 18: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ముస్లిం మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. వికారాబాద్ పట్టణంలో ఆదివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం పట్టణంలో ప్రధానవీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆవు పేడ విత్తన బంతులతో మేలు

వికారాబాద్, ఆగస్టు 18: సహజ దేశీయ ఆవు పేడతో చేపట్టిన విత్తన బంతులు నేలతల్లికి ఎరువుగా మారి ఎంతో మేలు చేస్తాయని తాండూరు మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. అనంతగిరిలో ఆవుపేడ, మట్టితో తయారు చేసిన విత్తన బంతులను ఆదివారం అనంతగిరిలో టూరిస్టులతో కలిసి అడవిలో విసిరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్షాబంధన్‌ను పురస్కరించుకొని ముందస్తుగానే దీర్ఘాయుష్ అనే సంస్థ ప్రకృతిని కాపాడాలంటూ ఆవుపేడతో తయారు చేసిన రాఖీలను టూరిస్టులకు అందజేశారు. ప్రకృతిని కాపాడదామని పర్యావరణాన్ని పరిరక్షిద్దామని సస్యశ్యామలం చేద్దామనే నినాదాన్ని పర్యాటకులకు తెలియజేయడం జరిగిందన్నారు. ప్రకృతిని కాపాడాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు.



పర్యాటకులతో కలిసి విత్తన పంతులు చూపుతున్న విజయలక్ష్మి

వయానాడ్ వరద బాధితులకు విరాళం

ధారూరు, ఆగస్టు 18: కేరళ రాష్ట్రంలోని వయానాడ్ వరద బాధితులకు ధారూరు ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ అండగా నిలిచింది. వరద బాధితుల కోసం దాతల నుంచి సేకరించిన రూ.66వేలను కేరళ సీఎం సహాయనిధికి పంపించినట్లు ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం తెలిపారు. వయానాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు అందజేసిన దాతలందరికీ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.